# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 12 హైదరాబాదు డిసెంబరు, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 12 Hyderabad December, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామ్మృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
డిసెంబర్ 2024

**Sri Ramana Jyothi**
December 2024

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 124వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **అమరనీతి నాయనార్** | శ్రీమతి మల్లాది ఫణిమాల | 11 |
| **3** | **శ్రీమతి ఎడిత్ మేసన్** | సరోజా ప్రసాద్ | 17 |
| **4.** | **ప్రారంభ దినముల నుండి** | శ్రీ రవికృష్ణ శర్మ | 20 |
| **5.** | **భగవాన్ సజీవ సత్సంగం** | వి. రమేష్ బాబు | 29 |
| 6. | Humility and Spirituality | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 31 | V Krithivasan | 39 |
| 8. | Tales of Bhagawan | Chalam | 43 |
| 9. | How I Came to Bhagavan's Fold.... | Yogendra Sharma | 45 |
| 10. | Take Me Home | Sneha Choudhury | 48 |
| 11. | Divine Reveals to the Deserving! | V Siva Kumar | 49 |

**Events in Sri Ramana Kendram in December 2024**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 13th - Karthigai Deepam : Lighting the deepam and Satsang 6.00 p.m.
3. 17th - Punarvasu Satsang and Bhagavan's 145th Jayanthi Day The Jayanthi Celebrations will be held in Kendram on 22nd December from 9.00 a.m. to 12.00 noon
4. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# లౌకిక సంబంధాలు

డా॥ కే.యస్. గారి 124వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

**అవినయ మపనయ విష్ణో దమయ మనః శమయ మృగ తృష్ణామ్।**
**భూతదయాం విస్తారయ తారయ సంసార సాగరతః ॥**

ఆది శంకరుల 'విష్ణు షట్పదీ' స్తోత్రంలోని ఆరు అందమైన శ్లోకాలలో మొదటిది. మనమందరం దేనిని గురించి ప్రార్థించాలి అనే విషయం ఈ శ్లోకంలో చెప్పబడుతున్నది. వినయం అంటే నమ్రత; అవినయం అంటే నమ్రత లోపించడం, అదే గర్వం. మన గర్వాన్ని తీసివేయమని భగవంతుడిని ప్రార్థించాలని శంకరులు అంటున్నారు. అది ఒక సాధకునికి ఉండవలసిన గుణం. ఎందుకంటే, ఆధ్యాత్మికత, గర్వమూ జంటగా ఉండలేవు. సాధారణ సంభాషణలో కూడా పదాలను మనం వీలైనంత తక్కువగా వాడాలి. మాటలనే కాదు, దేనినీ వృథా చేయరాదు. అతిశయోక్తి గాని, కనిష్ఠీకరణ గాని ఉండరాదు. మనం శ్రద్ధ చూపినప్పుడే అది వీలవుతుంది.

తరచు, మనం బాబా భక్తులమని లేదా మహర్షి, అరబిందో మొదలైన వారి భక్తులమని గాని చెబుతుంటాము. 'భక్తుడు' అన్నది గొప్ప పదం. అసలైన భక్తుడు తాను భక్తుడనని చెప్పుకోడు. తనను అలాగ వర్ణించడం ఇతరులు చేయవలసినది. మనందరం కూడా భక్తులమవడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాము. చాలావరకు మనం

స్వీయ భక్తులం. అప్పుడప్పుడు మాత్రమే మనం మనకు కాక ఎవరో ఒకరికి భక్తులమయ్యే ప్రయత్నం చేస్తాం. అలానే పూజ విషయానికి వస్తే మనం ఏదైనా విగ్రహాన్ని పూజించాలా లేక గుడికి వెళ్ళాలా అన్న సందిగ్ధంలో పడతాం. మనం మన శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడంపై అతిగా శ్రద్ధ చూపుతాం. ప్రొద్దున, సాయంత్రం వేళకు స్నానం చేయలేకపోతే ఎంతో చికాకు పడతాం. శరీరంపై శ్రద్ధ చూపుతున్న మనం, మనసును అలాగే శుభ్రం చేసుకోవాలని మాత్రం ఆలోచించం. మనసును పరిశుద్ధం చేసుకోవాలి లేదా సంపూర్ణంగా వినాశనం చేయాలి అన్న శ్రద్ధ ఉన్నవారు, శరీర శుభ్రత గురించి శ్రద్ధ చూపరు. అటువంటి వారు, నీరు లభిస్తే, శరీరాన్ని శుభ్రం చేసుకుంటారు. లేకపోతే, శరీరాన్ని మురికిగానే ఉంచుకుంటారు.

వివేకానికి పూర్వ స్థితి అవినయం, అంటే గర్వం. గీత, మహాభారతం గురించిన జ్ఞానం కేవలం మేధోపరమైన స్థాయిలో జరిగేది. అది అనుభవం మీద ఆధారపడినది కాదు. లడ్డూలను ఎలా తయారు చేయాలో తెలిపే పద్ధతిని చదవడం, దానిని తయారు చేయడానికి ప్రత్యామ్నాయం కాదు. మనం వేదాంతం గురించి కేవలం చదవడం అన్నది అలాగ ఏదో పదార్థం తయారు చేసే పద్ధతిని చదవడంతో సమానం. ఆ పదార్థంలో ఏమేమి వస్తువులు ఉంటాయో తెలుసుకోవడం మాత్రమే జరుగుతుంది. ఆఖరుకు మన పరిమితమైన మనస్సుతో తెలుసుకోలేమన్నది అర్థం కావడం వివేకం.

వేదాంతం అన్న పదం జ్ఞానానికి ఆఖరు దశ అన్నది అసలైన అర్థం. అందుకే ఈ ప్రపంచంలోని ఏ విషయానికి సంబంధించిన జ్ఞానం, ఆ జ్ఞానాన్ని నిజంగా అభ్యాసంలో వాడుతున్నప్పుడే ఉపయోగంలోనికి వస్తుంది. నీవు భౌతిక శాస్త్రజ్ఞుడవు కాదలచు కుంటే మనస్సును భౌతిక శాస్త్ర అభ్యాసంపై దృష్టి పెట్టాలి. కొంత కాలం తరువాత నీవు ఆ శాస్త్రంలో ప్రవీణుడవు అవుతావు. నిజానికి, ఏదో ఒక విషయాన్ని ఎంతో క్షుణ్ణంగా తెలుసుకుని ఉన్నప్పటికీ, దానిని గురించి సంపూర్ణంగా తెలుసుకోలేవు. ఎవరూ అలాగ అనుకోవడానికి వీలులేదు. అందుకే శాస్త్ర విషయాలు రోజు, రోజుకూ విస్తరిస్తూ పోతుంటాయి.

గతంలో రసాయన శాస్త్ర పుస్తకాలలో అణువు అంటే ఇక విచ్ఛేదన చేయబడలేనిదని చెప్పబడేది. కాని, ఒకసారి అణువు విచ్ఛేదనం జరగడబడేసరికి ఆ నిర్వచనం మార్చబడినది. అణుబాంబు తయారు చేయబడడంతో మనం ఊహించలేనంతగా శక్తిని విడుదల చేయబడింది. ఆ శక్తిని మానవాళి శ్రేయస్సుకు, చెడు పర్యవసానాలకు కూడా ఉపయోగించబడినదని మనకు తెలుసు. రాయల్ ఎయిర్ ఫోర్సులో గ్రూప్ కెప్టెన్‌గా ఉన్న లియోనార్డ్ చెషైర్ బ్రిటీషు వారు. అమెరికా దేశస్థులతో కలసి హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబు వేయడానికి నియోగింపబడ్డాడు. ఆ కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు విక్టోరియా క్రాస్ బిరుదును అతనికి ప్రదానం చేయబడినది. బాంబును వేయడంతో జరిగిన ఘోర విధ్వంసాన్ని

గమనించిన చెషైర్ చెప్పలేనంతగా కృంగిపోయారు. యుద్ధం ముగిసిన తరువాత ఎయిర్ ఫోర్సు నుండి రాజీనామా చేసి బయటపడిన చెషైర్ పశ్చాత్తాప సూచకంగా, తన వద్దనున్న ధనాన్ని ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో అంద విహీనులైన వారి సేవ కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. భారతదేశంలో కూడా అలాంటి కొన్ని స్థావరాలను నెలకొల్పారు.

మూడువేల సంవత్సరాల క్రితమే, ఒక ఉపనిషత్తు భగవంతుని వర్ణిస్తూ ఇలా చెప్పింది. **అణోరణీయాన్ మహతో మహీయాన్**

భగవంతుడు అతి చిన్న అణువు కంటే సూక్ష్మమైనవాడు, అతి పెద్దదానికంటే పెద్దవాడు. మొదట అణుబాంబు అమెరికాలోని నెవాడాలో పరీక్షించబడినది. దానిలో పాల్గొన్న ఓపెన్ హీమర్ అనే శాస్త్రజ్ఞుడు ఆ ప్రయోగ ఫలితాలకు సాక్షిగా ఉన్నాడు. అతను భారతీయ తత్త్వ శాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసిన వ్యక్తి. బాంబు విస్ఫోటనం జరుగుతున్న సమయంలో, భగవద్గీతలోని “నేను అగ్నిని, నేను వినాశకారుడిని” అన్న శ్లోకాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

యోగులు, ఋషుల ప్రవర్తనను మనం ముందుగా ఊహించలేము. కొన్ని సమయాలలో వారు కఠినంగా ఉన్నట్లు, మరి కొన్ని సమయాలలో పువ్వురేక కంటే మృదువుగా ఉన్నట్లూ కనిపిస్తారు. అటువంటప్పుడు, మనకేమి తెలుసునని మనం మాట్లాడగలము? నిజంగా చెప్పాలంటే, మనకు ఏమీ తెలియదు. అందువల్ల, మనకున్న జ్ఞానాన్ని చూసుకొని గర్వపడడం తగదు.

మనలో ప్రతి ఒక్కరూ (ఏదేని విషయం గురించి)ఏదో కొంత జ్ఞానాన్ని కలిగి ఉండవచ్చు, కాని అన్ని విషయాలలో నైపుణ్యత మనకు ఉండదు. ఉదాహరణకు గుండెకు సంబంధించిన వైద్యుడి దగ్గరకు వెళ్ళినప్పుడు, అతని అభిప్రాయాన్ని మనం తప్పక వినాలి. కాని, మన దేహంలో ఇతర భాగాలు కూడా ఉన్నాయి. సామాన్యంగా వాటికి సమస్య వచ్చినప్పుడు సాధారణ వైద్యుడు (జనరల్ ఫిసీషియన్) వాటికి చికిత్స చేస్తాడు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం అటువంటి వైద్యులు అతి తక్కువమంది ఉన్నారు. ఒక ప్రత్యేక వైద్య చికిత్సా నైపుణ్యుడు, రోగి గుండె పరిమాణం పెరిగిందని చెప్పగలడు. సాధారణ కుటుంబ వైద్యుడు రోగిని కంగారు పడవద్దని, అతని తండ్రికి కూడా అటువంటి పరిస్థితి ఉండేదని చెబుతాడు. ఒక వైద్యడు, పలువురు రోగులను పరిశీలించిన అనుభవంతో మనకు చికిత్స చేస్తాడు. అయితే ప్రతి జీవుడు ప్రత్యేకమైనవాడే.

నీ శరీరాన్ని గుర్తించిన అవగాహన, నీకు తప్ప, ఎవరికీ ఉండదు. అందుకే, వైద్యునికి నీ పరిస్థితి ఏమిటో నీవే చెప్పాలి. కొందరు వైద్యులు మనం చెప్పినది విని, దానికి తగ్గట్లు ప్రత్యేక రీతిలో చికిత్స చేస్తారు. మందుల విషయానికి వస్తే, ఒకే మందు అందరికీ ఇవ్వబడదు. ఎందుకంటే, ప్రతి వ్యక్తి శరీరం ఒకే విధంగా స్పందించదు కనుక. ఉదాహరణకు, కొందరికి పెన్సులిన్ పడదు. అటువంటి వారికి మరొక విధంగా చికిత్స చేస్తారు. మందును నిర్ణయించడం అనేది ఒక విధంగా ఒక కళ. రోగి స్పందనను బట్టి

ఏ మందు మంచిదో నిర్ణయించబడుతుంది. కాని వ్యక్తులు తమ శరీర పరిస్థితి, తత్వాన్ని తెలుపడానికి ఇష్టపడరు.

ప్రతి జీవి విలక్షణమైనదే. ఈ అవగాహన సాధన విషయంలో కూడా అవసరం. భగవాన్ సుమారు ఒక ఇరువది నిమిషముల పాటు మరణానుభవాన్ని అనుభవించారు. ఆ సమయంలో శరీర స్పృహ నశించింది. తానేమిటో వారికి తెలియలేదు. అకస్మాత్తుగా ఆ వెంకట రమణుడు తనకు నామ రూపాలు లేవని గుర్తించాడు. 16 ఏళ్ళ వయసులో దానిని గురించి వ్రాసిన జాబు ఎంతో అద్భుతమైనదని ఇటీవలే చెప్పాను. అటువంటి జాబును మనం వంద ఏళ్లు నిండినప్పటికీ వ్రాయలేము. కారణం ఏమిటంటే, అది ఆలోచించి వ్రాసినది కాదు. ఒక ఉన్నత శక్తి ప్రోద్బలంతో వ్రాయబడినది. ఆ జాబులో "నా తండ్రి ఆజ్ఞ ప్రకారం, ఆయనను వెదకటానికి వెళుతున్నాను అని మొదలయింది. తరువాత "ఒక మంచి కార్యం కొరకు ఇది బయలుదేరింది. దీనిని వెదకడం కోసం డబ్బు ఖర్చు పెట్టనక్కరలేదు. ఈ విషయమై ఎవ్వరూ దుఃఖపడ వలసిన అవసరం లేదు. కాలేజి రుసుము కట్టబడలేదు. రెండు రూపాయలు ఇక్కడ ఉంచడం జరిగింది" అని ఉన్నది. ఆఖరున కొన్ని గీతాలు మాత్రం గీచారు. మొదటి వాక్యం "నా" అని మొదలు పెట్టినది, రెండవ వాక్యంలో "ఇది" అని మారింది. భగవాన్ ధోరణి లోని మార్పు దీనివల్ల తెలుస్తున్నది. మొదట నేనును గురించి వ్రాసి, అటు తరువాత 'దీనిని'గా మార్చారు. అంటే 'శరీరాన్ని' వెదకడం కోసం డబ్బు వృథా చేయవద్దు అని వారి భావం. నేనుతో మొదలై ఇదిగా మారి చివరికి నామ రూప రహితంగా అయింది.

ఎవరైతే వెంకటరామన్ గా ఉన్నారో వారిప్పుడు **చిదానంద రూపః శివోహం శివోహం** అయ్యారు. మీరు శివమై ప్రతిదీ కూడా శివం అయినప్పుడు, ఇతరము అనే ప్రశ్న ఎక్కడ ఉంటుంది?

నీవు తెలివైన వాడినని భావిస్తే, అంతకంటే తెలివైనవాడు తప్పక ఎదురవుతాడు. నీవు ఒక విషయంలో గొప్పవాడిననుకుంటే, అంతకంటే ఎక్కువ గొప్పవాడు ఇంకొకడుంటాడు. ఒక రంగంలో ఉత్తముడనుకుంటే, నీ అంచనా తప్పు అని నిరూపించే ఇంకొకడు ఉంటాడు. మనమే గొప్పవారమని భావించకూడదు. దీనినే వేదాంతం 'వివేకము' అంటుంది. వేదాంతం ప్రకారం, వివేకము, జ్ఞానము పూర్తిగా వేరైనవి. జ్ఞానము మనసుకు సంబంధించిన దయితే, జ్ఞానానికి అంతం వివేకం. నాకు ఏమీ తెలియదనుకున్న క్షణం వివేకం మొదలైనట్లు. ఏ క్షణమైతే నాలో సంపూర్ణ నమ్రత కలుగుతుందో ఆ క్షణం నిజమైన జ్ఞానం కలిగి ఉన్నట్లు. ఇది కృత్రిమంగా ఏర్పరచుకున్న నమ్రత కాదు. అది యథార్థమైన నమ్రత. భగవంతుని కృప వల్ల అది మన ప్రతి చర్యలో ప్రతిఫలిస్తుంది. కృత్రిమంగా ఏర్పరచుకున్న నమ్రత ఇతరుల మెప్పు కోసం తయారు చేసుకున్నది.

'సౌందర్యలహరి'లో శంకరులు "ఓ జగన్మాతా! నీ వద్ద శ్లోకాలు, పద్యాలు ఉన్నాయి. నేను వ్రాతగాడిని. పదాలను నీవు నాకు ఇచ్చావు. నేను వాటిని తిరిగి నీకు సమర్పిస్తున్నాను. ఈ శ్లోకాల రచయితను నేను కాదు. అవి నాకు ఇవ్వబడినవి" అని అంటారు. సంక్రాంతి పర్వదినాన సూర్యునికి కర్పూర హారతిని ఇస్తారు. ఇది ఒక అర్థం లేని చర్య. ఎందుకంటే, సూర్యుడు

ఎక్కడుంటే అక్కడ కర్పూరం ఏర్పడుతుంది. సూర్యుడు లేకుండా కర్పూరం తయారుకాదు. ఈ విశ్వంలో ప్రతిదానిలో వేడిని అందిస్తాడు సూర్యుడు. అయినప్పటికీ, కర్పూరాన్ని వెలిగించి సూర్యునికి హారతి ఇస్తాము. సూర్యుడి నుండి లభించిన దానినే తిరిగి ఆయనకు సమర్పిస్తాము. అదే విధంగా, జగన్మాత నుండి తనకు లభించిన పదాలను, ఆ జగన్మాతకే తిరిగి సమర్పిస్తున్నాను అని శంకరులు అంటారు. నదినుండి నీటిని తీసుకుని, ఆ నీటినే తర్పణంగా సమర్పిస్తాం. మనం గ్రహిస్తున్న ప్రతీది, భగవంతుని కృప వల్లనే లభిస్తున్నది. సాధకుడు మొట్టమొదట తెలుసుకోవలసినది ఇదే.

తన గర్వాన్ని తుడిచిపెట్టమని శంకరులు భగవంతుడిని కోరుకుంటున్నారు.

**అవినయ మపనయ విష్ణో దమయ మనః శమయ మృగ తృష్ణామ్।**
**భూతదయాం విస్తారయ తారయ సంసార సాగరతః ॥**

అంటే మొదట కలిగి ఉండవలసిన లక్షణం వినయం. ఋషులు, యోగులు అందరూ ఎంతో గొప్ప నమ్రతను కనబరచిన వారు. వివేకం ఉన్నచోట నమ్రత ఉంటుంది. జ్ఞానం ఉన్నచోట గర్వం ఉంటుంది. వివేకము మరియు జ్ఞానము కలిసి ఉండవు. కొద్దిపాటి జ్ఞానం మనకు గర్వాన్ని కలుగజేస్తుంది. కాని ఎప్పుడైతే మనం జ్ఞానాన్ని అధిగమించి వివేకములోకి చేరుకుంటామో, అప్పుడు భగవంతుడు మనయందు సంపూర్ణమైన నమ్రతా భావాన్ని అనుగ్రహిస్తాడు.

******

### పరమేశ్వరునియందు నాయనార్ల భక్తి

# అమరనీతి నాయనార్

శ్రీమతి మల్లాది ఫణిమాల

నాయనార్లు సా.శ. 5,10 శతాబ్దాల మధ్య తమిళనాడులో నివసించినట్లుగా చరిత్ర చెబుతోంది. 63 మంది గొప్ప శివ భక్తులు వీరు. వీరి గురించి 13 వ శతాబ్దంలో శెక్కిళార్ గారిచే రచించబడిన తమిళ భక్తి ప్రబంధం పెరియపురాణంలో విపులంగా వ్రాయబడి ఉన్నది. వీరు భక్తి మార్గాన్ని అనుసరించి ముక్తిని పొందినట్లు ఈ పురాణం ద్వారా మనం గ్రహించవచ్చు. వీరు భగవంతుడిని తల్లిగా, స్నేహితునిగా, పుత్రునిగా, యజమానిగా భావించి ఆరాధించి, పూజించి తరించారు. విష్ణుభక్తులైన 12 మంది ఆళ్వార్లతో కలిపి వీరిని దక్షిణభారతదేశపు భక్తి దూతలుగా అభివర్ణిస్తారు. భగవంతుని చేరుకోవడానికి కావలసినది కేవలం నిష్కల్మషమైనటువంటి భక్తి మాత్రమేనని 63 నాయనార్ల చరిత్రలు చదివితే మనకు అర్థం అవుతుంది. ముందుగా ఈ సంచికలో అమరనీతి నాయనార్ ను గురించి తెలుసుకుందాం.

అమరనీతి నాయనార్ చోళ రాజ్యానికి రాజధాని అయిన ‘పళయరయ్’ అనే గ్రామంలో బంగారము, వజ్రాలు మరియు వస్త్రాల వ్యాపారం చేసుకునే వారింట జన్మించాడు. అతడు వైశ్య కులస్థుడు. పెరిగి పెద్దవాడై గొప్ప శివ భక్తునిగా మారాడు. పరమేశ్వరుని తన సేవతో అలంకృతం చేసినటువంటి గొప్ప శివ భక్తుడు అమరనీతి నాయనార్. వజ్రాల వ్యాపారంలో సంపాదించిన

ధనంతో అమరనీతి ఒక పెద్ద సత్రం కట్టాడు. ఎక్కడెక్కడి నుండో శివభక్తులంతా ఆ సత్రానికి వచ్చి భోజనం చేసి నివాసముండేవారు. అమరనీతి అక్కడ బస చేసే భాగవతోత్తములందరికి భోజనానంతరం వస్త్రదానం చేసేవాడు. ఆ వస్త్రం ఏమిటంటే సాధారణంగా లోకంలో వస్త్రదానం పేరిట చేయబడే దానంలో ఇచ్చినట్టు పంచల చాపు, పట్టుపీతాంబరాలు కాకుండా తాను కట్టించిన సత్రానికి వచ్చి బస చేసే శివభక్తులందరికీ అమరనీతి నాయనార్ ఒక కౌపీనాన్ని దానం చేసేవాడు. ఇలా కౌపీనాలను దానం చేయడంలో గల ఆంతర్యం ఇదే:

**వేదాన్తవాక్యేషు సదా రమన్తః భిక్షాన్న మాత్రేణ చ తుష్టిమన్తః।**
**వి శోకమన్తఃకరణే రమన్తః కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః ॥**

కౌపీన పంచకంలో శ్రీ ఆదిశంకర భగవత్పాదుల వారు ఆవిష్కరించినట్లు, వేదాంత విషయాలలో సదా రమిస్తూ, భిక్షాటన చేత లభించిన దానితో సంతుష్టుడై శోకాన్ని వదిలి ఉన్నవాడు, కౌపీనధారి అత్యంత భాగ్యశాలి.... బ్రహ్మనిష్ఠలో రమించే అపరశివ భక్తులకి కౌపీన వస్త్రం కంటే ఆనందాన్ని ఒసగేది మరొకటి ఏముంటుంది? అందుచేత శివైక్య స్థితిలో నిత్యము రమించగల ఆ శివ భాగవతులకి అమరనీతి నాయనార్ కౌపీనాలను దానం చేస్తూ ఉండేవాడు. అంటే, 'శివ భక్తుల కైంకర్యమే శివ కైంకర్యము' అనేటటువంటి సత్యాన్ని తెలుసుకుని జీవించేవాడన్నమాట. తన సత్రానికి విచ్చేసిన వాళ్ళకి భోజనం పెట్టి పొంగిపోయేవాడు. మంచినీళ్లిచ్చి పరమానంద భరితుడయ్యేవాడు. కాళ్లు కడిగి

కౌపీనాన్ని దానం చేసి ఆ కాళ్లు కడిగిన నీటిని నెత్తిమీద చల్లుకొని తరించిపోయేవాడు అమరనీతి! ఈశ్వరుని నమ్ముకున్న వాళ్ళని సేవిస్తే ఈశ్వరుని సేవించినట్టే అనేటటువంటి సద్భావన మరియు నమ్మకమే అమరనీతి చేపట్టిన ఈ కౌపీన దానానికి నాంది పలికాయి.

ఇలా సేవించుకుంటూ ఉండగా కొన్ని సంవత్సరాలు గడిచి పోయాయి. శివభక్తుల పట్ల అమరనీతి చూపించే ఔదార్యము, వాత్సల్యము పరమేశ్వరుని ఆకర్షించినవి. కైలాస వాసి అయిన పరమేశ్వరుడికి ఒక ఆలోచన కలిగింది. తనని నమ్ముకుని, తన భక్తులను త్రికరణశుద్ధిగా సేవించే తనయుడైన అమరనీతిని పరీక్షించి, అతని గొప్పతనాన్ని లోకానికి చాటాలని ఈశ్వరుడు సంకల్పించాడు. కావున ఒకరోజు బ్రహ్మచారి వేషంలో జటతో, విభూది పుండ్రాలు ధరించి దండం చేతపట్టి సరాసరి అమరనీతి నివాసానికి వేంచేశాడు పరమేశ్వరుడు. బ్రహ్మచారి తెచ్చిన దండానికి చివర రెండు కౌపీనములు, విభూతి సంచి కట్టబడి ఉన్నవి. ఆయన ముఖ వర్చస్సు బ్రహ్మతేజముతో వెలిగిపోతుండడం గమనించాడు అమరనీతి. నాయనారు స్వాగత వచనాలను అందుకొని, బ్రహ్మచారి సత్రంలోకి అడుగుపెట్టి ఆసీనులైనారు. ‘‘అమరనీతి! శివ యోగులను, శివ భక్తులను నీవు సేవించే తీరు బహు ముచ్చటగా నున్నది. శివభక్తుల ఎడ నీకు గల ప్రేమానురాగాలు, భక్తిశ్రద్ధలు ఎంతో గొప్పవి సుమీ. మిమ్ములను అభినందించడానికి నేను మీ వద్దకు వచ్చాను’’ అని బ్రహ్మచారి అమరనీతి నాయనారుని వేనోళ్ళ

కొనియాడాడు. బ్రహ్మ తేజస్సుతో వెలిగిపోతున్న శివయోగి సాక్షాత్తు పరమేశ్వరుడే అని భావించిన అమరనీతి తన సేవా కైంకర్యములను, ఆతిథ్యాన్ని స్వీకరించవలసిందిగా బ్రహ్మచారిని అర్థించాడు. అప్పుడు ఆ బ్రహ్మచారి, "నేను కావేరి నదికి ఏగి స్నానానుష్ఠానములు నెరవేర్చుకుని వచ్చెదను. అటుపిమ్మట నీ ఆతిథ్యాన్ని తప్పక స్వీకరిస్తాను" అని అమరనీతితో అంటూ, తన దండానికి కట్టబడిన రెండు కౌపీనములు వర్షములో తడిసి ముద్దయిపోయాయని, మరో కౌపీనాన్ని అమరనీతికిచ్చి "దీనిని జాగ్రత్తగా దాచి ఉంచుము. నదీ స్నానము చేసి వచ్చి దీనిని ధరించెదను" అని చెప్పి కావేరీ నదికి బయలుదేరాడు ఆ బ్రహ్మచారి. బయటకు అడుగుపెట్టే ముందు మరొక్కసారి అమరనీతితో భద్రంగా దాచి పెట్టమని ఇచ్చిన కౌపీనము ఎంతో మహిమాన్వితమైనదని ఎట్టి పరిస్థితుల్లో దానికి భద్రతాలోపము వాటిల్లకుండా చూడమని హెచ్చరించాడు బ్రహ్మచారి. శివభక్తుల ఆజ్ఞను శివాజ్ఞగా భావించే అమరనీతి నాయనారు బ్రహ్మచారి భద్రంగా దాచమని ఇచ్చిన కౌపీనాన్ని సురక్షితంగా ఉంచుతానని హామీ ఇచ్చాడు.

ఇంతలో బ్రహ్మచారి స్నాన అనుష్టానములు ముగించుకుని అమరనీతి వద్దకు వచ్చి పొడి కౌపీనాన్ని ఇమ్మని అర్థించాడు. అమరనీతి కౌపీనాన్ని భద్రంగా దాచిన స్థలమునకేగి అక్కడ చూడగా కౌపీనము కనిపించలేదు. పరమేశ్వరుని మాయ చేత కౌపీనము అదృశ్యమైనది. బ్రహ్మచారి వద్దకు వచ్చి, "నన్ను క్షమించండి

మహాత్మా....ఎంత వెతికినను మీరు భద్రంగా దాచమని ఇచ్చిన కౌపీనము కనిపించుటలేదు. కావున దానికి బదులుగా నా వద్దనున్న కౌపీనమును మీకిచ్చెదను, స్వీకరింపుము'' అని కోరెను. బ్రహ్మచారికి పట్టలేనంత కోపావేశములు వచ్చాయి. ''ఏది ఏమైనా సరే నేను నీకు ఇచ్చిన కౌపీనము ఎంతో మహిమాన్వితమైనది గాన నాకు ఆ కౌపీనమే కావాలి'' అని బిగ్గరగా అరవసాగెను బ్రహ్మచారి. అతడి కాళ్ళ మీద పడి నచ్చచెప్పి తన వద్దనున్న కౌపీనాన్ని స్వీకరించమని అమరనీతి వేడుకున్నాడు. అప్పుడు బ్రహ్మచారి, ''అలాగే కానిమ్ము. కానీ ఒక షరతు! ఒక తక్కెడ తీసుకువచ్చి నా ఇంకో కౌపీనానికి సరితూగే కౌపీనాన్ని నీవు తక్కెడతో పెట్టగలిగితే అప్పుడు దానిని స్వీకరిస్తాను'' అని అన్నాడు. బ్రహ్మచారి తన వద్దనున్న తడిసిపోయిన కౌపీనాన్ని ఆ త్రాసులో అమర్చాడు. అమరనీతి తన వద్దనున్న కౌపీనాన్ని అమిత భక్తితో పరమేశ్వరుని ప్రార్థించి తక్కెడలో ఉంచాడు. కానీ బ్రహ్మచారి యొక్క కౌపీనమే ఎక్కువ బరువు కలిగి ఉన్నది. అమరనీతి వద్దనున్న కౌపీనములన్నీ తెచ్చి తక్కెడలో పెట్టినా బ్రహ్మచారి వద్దనున్న కౌపీనానికి సమతూగ లేదు. అమరనీతి వద్దనున్న సంపద యావత్తు తెచ్చి పెట్టినా బ్రహ్మచారి కౌపీనమే బరువుగా తోచినది. ఇదంతయు పరమేశ్వరుని లీల అని తెలుసుకున్న అమరనీతి బ్రహ్మచారి ముందు మోకరిల్లి, ''అయ్యా! నేను, నా సతీమణి, నా కుమారుడు - ముగ్గురము కలిపి మీ కౌపీనముకు సమతూగుతామేమో దయచేసి చూడండి''

అని, సకుటుంబ సమేతంగా తక్కెడలో కూర్చున్నాడు. కూర్చునే ముందు పరమేశ్వరుని ఆర్తితో వేడుకున్నాడు అమరనీతి.

“ఈశ్వరా, నేను యథార్థంగా శివ భక్తులను నీ స్వరూపంగా భావించి ఆరాధించిన మాట వాస్తవమే అయితే, నా భక్తియందు ఎటువంటి దోషము లేని యెడల త్రాసు సరితూగుగాక” అని ప్రార్థించి కూర్చున్న వెనువెంటనే అమరనీతి పుణ్యము బ్రహ్మచారి కౌపీనమునకు సమతూగి త్రాసు కూడా ఆశ్చర్యంగా సమతూగింది.

అందరూ చూస్తుండగానే బ్రహ్మచారి అంతర్ధానమైపోయి పార్వతీ పరమేశ్వరులు వృషభ వాహనారుఢులై ప్రమథగణాలతో అక్కడ ప్రత్యక్షమైనారు. “ఓ అమరనీతి! నీ కౌపీన దాతృత్వము, శివ భక్తులకు నీవు ఒనర్చిన నిరుపమాన సేవ మమ్ములను అలరించినవి. నీకు, నీ భార్యకు, నీ పుత్రునికి కైలాసవాసం అనుగ్రహిస్తున్నాము” అని పరమేశ్వరుడు అమరనీతి నాయనారును ఆశీర్వదించిన వెను వెంటనే త్రాసు పుష్పక విమానంగా మారి అమరనీతి నాయనారును సకుటుంబ సమేతంగా కైలాసానికి చేర్చింది. ఈ విధంగా శివభక్తితో సాధించలేనిది ఏదీ లేదని అమరనీతి నాయనారు లోకానికి చాటెను.

******

# ఆస్ట్రేలియా దేశస్థురాలి సత్యాన్వేషణ
# శ్రీమతి ఎడిత్ మేసన్

సరోజా ప్రసాద్

ఒక భారతీయ ఋషి గురించి తెలుసుకోవడానికి, ఆస్ట్రేలియా దేశస్థురాలు, బయట ప్రపంచానికి తెలియని మారుమూల ప్రదేశానికి, సముద్రాలు దాటి, వేల మైళ్ళు ప్రయాణించి ఎందుకు రావాలి? ఇటువంటి జ్ఞానులు క్రైస్తవ మతంలో లేరా? కనీసం ఇప్పుడు భౌతికంగా మనమధ్య కూడా లేని హైందవ ఋషి బోధలు అధ్యయనం చేయడానికి ఇంత దూరం రావడమెందుకు?

ఎందుకంటే, యాభై సంవత్సరాలకు పైగా ఇక్కడ నివసించిన భగవాన్ శ్రీ రమణ మహర్షి అనే జ్ఞాని - సాక్షాత్తు భగవంతుని అవతారమే. ఈ భగవదంశనే ఆత్మ స్వరూపమన్నారు భగవాన్. మానవ చరిత్రలో ఇటువంటి అవతారమూర్తులు ఏసుక్రీస్తు, బుద్ధుడు - ఇలా కొద్దిమందే కనపడతారు.

అమెరికా అధ్యక్షుడు విల్సన్ కుమార్తె బొంబాయికి వచ్చినప్పుడు, తనను అరుణాచలం తీసుకు వెళ్ళమని కోరిందట. ఆమె రమణాశ్రమానికి వచ్చేసరికి, భగవాన్ సన్నిధిలో పలువురు సందర్శకులు హాలులో కూర్చొని ఉన్నారు. ఆమె కూడా అందరి మధ్యన నేల మీద కూర్చున్నది కాని, ఈమె గురించి, అక్కడ ఎవరూ పట్టించుకోలేదు. అక్కడ ఉన్న విదేశీయులలో ఈమె ఇంకొకరు. అక్కడ ఒక రాత్రి గడిపి తిరిగి వెళ్ళింది. ఎవరూ ఆమెతో స్టేషన్ దాకా వచ్చి సాగనంపలేదు. అసలు ఆమె ఎవరో తెలిస్తే కదా!

అమెరికా వెళ్ళాక, అక్కడి వార్తా పత్రికల్లో ఆమె వ్యాసాలు వ్రాసింది. జీసస్ బోధలు ఇప్పుడు తనకు అర్థమైనాయని, ఏసుక్రీస్తు ఎలా జీవించి ఉంటాడో తెలియవచ్చిందని ఆమె వ్రాసింది.

సరిగ్గా నేను కనుగొన్నది కూడా ఇదే. ఏసుక్రీస్తు వాక్కులు, ఇప్పుడు సజీవ సత్యాలుగా ఆవిష్కృతమైనాయి. "ప్రయాసపడి భారము మోసుకొని వస్తున్న పథికులారా, నన్ను తెలుసుకొనుడు, మీ ఆత్మలకు విశ్రాంతి కలుగజేతును" అన్నాడు కదా ఏసుక్రీస్తు. "భగవంతుని సంపూర్ణంగా శరణుజొచ్చి ఆయనపై భారం వేయండి. మిగితాది ఆయనే చూసుకొంటాడు" అన్న భగవాన్ వాక్కుకు పైన చెప్పిన ఏసు వాక్కుకు తేడా ఉన్నదా? "మీ ఆత్మలకు శాంతి కలుగజేతును" అన్న ఏసు వాక్కుకు అర్థం జనన మరణాల నుండి విముక్తియేనా?

ఇలా ఏసుక్రీస్తు బోధలు, మహర్షి ఉపదేశాలు పోల్చి చూస్తే, భగవాన్ బోధలు ఎంత సూటిగా, స్పష్టంగా ఉంటాయో మనకు బోధపడుతుంది. వాటి అర్థం విషయంలో, ఎటువంటి సందేహాలకు, గందరగోళానికి ఆస్కారముండదు. "స్వర్గ రాజ్యం మీలోనే ఉన్నది" అని ఏసు చెప్తే, "మీ నిజ స్వరూపం తెలుసు కోవాలంటే ఆత్మ విచారణ చేయండి" అన్నారు భగవాన్.

ఏసుక్రీస్తు ఈ భువిపై అవతరించినప్పుడు ఆయన అవతార పురుషుడని కొద్దిమంది మాత్రమే గుర్తించగలిగారు. ఆయన శిష్యులలో కూడా కొందరు, ఆ అవతార లక్ష్యమేమిటో గ్రహించ లేకపోయారు. "ప్రపంచం అంతరించినా, నా వాక్కు మాత్రం మిగిలి

పోతుంది'' అన్నాడు జీసస్. భగవాన్ లాగే ఆయనకు కూడా సత్య స్వరూపం తెలుసు.

భగవాన్ సన్నిధిలో జీవించడం, భౌతికంగా వారిని దర్శించు కోగలగడం, వారు నడయాడిన పుణ్యస్థలంలో నేడు ఆరాధించడం - ఈ అనుగ్రహం చాలు, జీవితమంతా అణకువతో గడిపేందుకు...

ఒకప్పుడు 'జెరూసలెంలో ఏసుక్రీస్తు రోడ్డు ప్రక్కన చేరిన జన సమూహానికి ఉపదేశం చేస్తుండగా మేరీ కూడా ఆ సమూహంలో ఉన్నది. ఆమె ఏసును ఎంతగానో ఆరాధించి, ఆయన పలికే ప్రతి మాటను శ్రద్ధా భక్తులతో ఆలకించేది. ''మీ శత్రువులను కూడా ప్రేమించండి. మిమ్మల్ని ద్వేషించే వారికి కూడా మంచి చేయండి'' అని బోధించాడు జీసస్. స్వరూప జ్ఞానంతోనూ, దివ్య ప్రేమతోను ఆయన కనులు ప్రకాశించాయి. మీ బోధ నాకు శిరోధార్యము ప్రభూ, తప్పక ఆచరిస్తాను'' అన్నది మేరీ.

ఏసు ప్రభువు మహిమ కాని, భగవాన్ రమణుల సన్నిధి మహిమ కాని అటువంటివి. భగవాన్ సాక్షాత్తు ఆ పరమాత్మ స్వరూపమే. వారి సన్నిధికి చేరినవారు చేయవలసినదల్లా, ఆ దివ్యజ్యోతికి ప్రణమిల్లి, వారి ఉపదేశాన్ని ఆచరించడమే.

******

# ప్రారంభ దినముల నుండి

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Surpassing Love and Grace **లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ రవికృష్ణ శర్మ**

(ఈ వ్యాసం స్వామి ఓంకార్ గారి పీస్ - ప్రశాంతత) అనే మాసపత్రిక నుండి తీసుకొనడమైనది. ఈ వ్యాసం ఆ పత్రికలో 1931వ సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రచురితమైనది. ఇది పాల్ బ్రంటన్ మొదటిసారి శ్రీ రమణాశ్రమమునకు వచ్చిన విధానాన్ని వివరిస్తుంది. ఆ రోజులలో భగవాన్ గురించి అప్పటికి వచ్చిన వేరే ఇతర ప్రచురణల కన్నా పాల్ బ్రంటన్ "ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియ" (తెలుగులో రహస్య భారతంలో నా ఆధ్యాత్మిక అన్వేషణ) అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా భగవాన్‌ను గురించి విస్తృతంగా తెలుసుకునేలా చేసింది. పాల్ బ్రంటన్ భారతదేశానికి వచ్చినప్పుడు వారి నామము "ఆర్. రఫెల్ హర్స్ట్". వారు పాల్ బ్రంటన్ అనే నామముతో రచనలు చేసేవారు. అందువల్ల వారి కలం పేరు పాల్ బ్రంటన్. వారు ఈ పుస్తకం ద్వారా చాలా కీర్తిని గడించుట వలన, ఆ నామాన్నే దత్తత తీసుకుని జీవితాంతం అదే నామముతో కొనసాగారు.

ఆ రోజులలో ఒక పాశ్చాత్య దేశపు పత్రికా విలేకరి శ్రీ రమణాశ్రమానికి వచ్చిన ఘటన దిన పత్రికలలో వ్రాయటం చాలా ఆసక్తికరమైన విషయం).

ఆ రోజు సాయంత్రం సమయం 4.30 అయింది. భక్తులందరూ భగవాన్ ముందు హాలులో కూర్చొని పత్రికలలో

వచ్చిన ఒక ప్రకటన గురించి చర్చించుకుంటున్నారు. ఆ ప్రకటన ఏమిటంటే ఎవరో మిష్టర్ హర్స్ట్ మరియు ఒక బౌద్ధ భిక్షువు శ్రీ రమణాశ్రమానికి విచ్చేయాలని అనుకుంటున్నారు అని ఆ హాలులో ఉన్న గడియారం ఐదు గంటలు కొట్టేటప్పటికి ఒక వ్యక్తి ఐరోపా వారు ధరించే దుస్తులను ధరించి ఒక పళ్ళెంలో స్వీట్స్‌తో హాలు లోపలికి వచ్చారు. ఆ వ్యక్తిని అనుసరించి ఒక బౌద్ధ భిక్షువు కూడా హాలు లోపలికి వచ్చారు. వచ్చినవారు భగవాన్ ముందు స్వీట్స్‌తో ఉన్న పళ్లాన్ని భక్తితో సమర్పించి, భగవాన్ ఎదుట పద్మాసనంలో కూర్చున్నారు. వారే భగవాన్‌ను దర్శించటానికి విచ్చేసిన సందర్శకులు. వారి గురించే భగవాన్ భక్తులు ఆ సమయంలో చర్చించుకుంటున్నారు. ఐరోపా వారు ధరించే దుస్తులను ధరించి ఉన్న వ్యక్తి ఆర్. రఫెల్ హర్స్ట్. ఇంగ్లాండ్‌లో ఒక పత్రికా విలేకరి. ఈ దేశాన్ని సందర్శించటానికి వచ్చారు. వారు తూర్పు దేశాలలో కల ఆధ్యాత్మిక బోధలను గురించి లోతుగా అధ్యయనం చేయటానికి వచ్చారు. అలాగే ప్రాచ్య దేశపు ఆధ్యాత్మిక బోధలను సునిశిత బుద్ధితో బాగుగా అర్థం చేసుకొని దానిలో ఉన్న గొప్పతనాన్ని అవగాహన చేసుకొనటం వలన ప్రాక్, పశ్చిమ దేశాల మధ్య ఉన్న అనుబంధాలను బాగా పెంపొందించటానికి కారణం అవుతుంది అని అనుకున్నారు.

వారు ఎన్నో ఆశ్రమాలను సందర్శించిన తరువాత, శ్రీ రమణాశ్రమానికి వచ్చారు. ఎవరైతే బౌద్ధ భిక్షువు వారితో పాటుగా వచ్చారో వారు కూడా జన్మతః ఆంగ్లేయులు. ఆ బౌద్ధ భిక్షువు పూర్వాశ్రమంలో ఒక మిలటరీ అధికారి. కాని వారిప్పుడు స్వామి

ప్రజ్ఞానానందగా పిలవబడుతున్నారు. వారు రంగూన్‌లో ఒక ఇంగ్లీషు ఆశ్రమాన్ని స్థాపించారు.

ఆ ఇద్దరు సందర్శకులు ఏమీ మాట్లాడకుండా భగవాన్ ఎదుట మౌనంగా కూర్చున్నారు. ఆ సమయంలో సూది పడితే వచ్చే అంత శబ్దం కూడా ఆ హాలులో లేదు. అంత నిశ్శబ్దంగా ఉన్నది ఆ హాలు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ఏ వ్యక్తి అయితే ఆ ఇద్దరినీ శ్రీ రమణాశ్రమానికి తీసుకుని వచ్చారో వారు భగవాన్ ను ఏమన్నా సందేహాలు ఉంటే అడగవచ్చు అని అన్నారు. కాని వారిద్దరికీ ఏ విధమైన ప్రశ్నలు అడగాలని అనిపించకపోవటం వలన గంటన్నర సమయం మౌనంలోనే గడిచింది. అప్పుడు హర్స్ట్ తను భారతదేశమునకు రావటంలోని ఉద్దేశాన్ని చెప్పారు. అత్యాదరముతో కూడిన గొంతుకతో ఈ విధంగా అన్నారు. నేను భారతదేశానికి వచ్చింది ఆధ్యాత్మిక ఉన్నతిని పొందటానికి. ‘‘నేనే కాదు ఇంకా ఎంతోమంది పాశ్చాత్యులు తమ జీవితాలలో ఒక వెలుగును లేదా కాంతిని చూడాలని తాపత్రయంతో ప్రాక్ దేశాల వైపు చూస్తూ ఉన్నారు’’ అని అన్నారు. కాని భగవాన్ అంతర్ముఖత్వం చెంది ఉండడం వలన, వారిలో ఎటువంటి స్పందన లేదు. అక్కడ కూర్చున్న వాళ్ళలో ఒకరు ‘‘మీరు ఈ దేశానికి ప్రాక్, పశ్చిమ దేశాలలో గల మతాచారాలలో గల పోలికలను అధ్యయనం చేయటానికి వచ్చారా?’’ అని అడిగారు. దానికి బౌద్ధ భిక్షువు ‘‘లేదు, ఇటువంటి సమాచారం మాకు ఐరోపా దేశాలలో చాలా బాగా లభ్యమవుతుంది. కాని మేమొచ్చింది సత్యాన్ని తెలుసుకోవటానికి. మాకు ఒక ఆధ్యాత్మిక వెలుగు కావాలి. మేము ఆ సత్యాన్ని తెలుసుకోవచ్చా?’’ మేము ఆధ్యాత్మికోన్నతి పొందగలమా? అని అడిగారు.

భగవాన్ ఇంకా మౌనంగానే అంతర్ముఖత్వం చెంది ఉండడం వలన, ఆ వచ్చిన సందర్శకులు వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నారు. అందువలన ఆ సంభాషణ అక్కడితో ముగిసింది. ఆ సందర్శకులు వెళ్ళిన తరువాత, ఆ హాలులో ఉన్నవారందరూ, హాలును వీడి వెళ్ళిపోయారు.

ఆ మరుసటి దినం ఉదయం, ఆ సందర్శకులు మరల హాలు లోపలికి వచ్చి, సత్యాన్ని తెలుసుకోవాలన్న తీవ్రమైన ఆకాంక్ష కలిగిన వారై, భగవాన్‌తో సంభాషించటం మొదలుపెట్టారు. భగవాన్‌కు, ఆ సందర్శకులకు మధ్య జరిగిన సంభాషణలను ఈ క్రింది విధంగా కాపి చేసుకుని పొందుపరచటం జరిగింది.

**భిక్షువు:** మేము ఆధ్యాత్మికోన్నతి కోసం ఎంతో విస్తృతంగా, ఎన్నో ప్రాంతాలను, ఎంతో దూరం ప్రయాణించాము. ఆ ఆధ్యాత్మిక ఉన్నతిని ఎలా పొందగలము?

**మహర్షి:** లోతైన విచారణతో మరియు నిరంతర ధ్యానంలో ఉండడం వలన ఉన్నతమైన స్థితిని పొందవచ్చు.

**హర్స్ట్:** పశ్చిమ దేశాలలో ఎంతోమంది ధ్యానం చేస్తూ ఉంటారు. కాని వారిలో ఏ విధమైన పురోగతి కనిపించదు.

**మహర్షి:** మీకెలా తెలుసు వారు పురోగతి చెందటం లేదని? ఆధ్యాత్మిక ఉన్నతిని ఈ కంటితో లేదా మనస్సుతో గుర్తించటం లేదా ఊహించటం అంత తేలిక కాదు.

**హర్స్ట్:** కొన్ని సంవత్సరముల క్రితం నాకు ఆధ్యాత్మిక ఆనందానికి సంబంధించిన కొన్ని అనుభూతులు కనిపించాయి. కాని ఆ తరువాతి సంవత్సరాలలో అటువంటి అనుభూతిని నేను

కోల్పోయాను. మళ్ళీ క్రితం సంవత్సరం, నేను చాలా సంవత్సరాల క్రితం పొందిన అనుభూతులను మళ్ళీ పొందాను. ఎందుకిలా జరుగుతోంది?

**మహర్షి:** నీవు ఆ అనుభూతులను కోల్పోవటానికి గల కారణం, నీ ధ్యానం సహజమైనది కాకపోవటం వలన. నీవు ఎప్పుడైతే అలవాటుగా అంతర్ముఖత్వం చెందుతావో అప్పుడు నీకు అందమైన ఆ ఆధ్యాత్మిక ఆనందం ఒక సహజమైన అనుభవంగా మారుతుంది.

**హర్ష్:** ఈ సహజమైన ఆనందం లేకపోవటానికి ఒక గురువు లేకపోవటం కారణమా?

**మహర్షి:** అవును. కాని ఆ గురువు నీలోనే ఉన్నాడు. ఆ గురువే, నీ ఆత్మలో ఏకమై ఉన్నాడు. ఆత్మ అన్నా గురువు అన్నా ఒకటే.

**హర్ష్:** భగవంతుడిని సాక్షాత్కరించుకోవటానికి గల మార్గమేమిటి?

**మహర్షి:** విచారణ ద్వారా మరియు నిన్ను నీవు "నేనెవరు?" అని, నా యొక్క స్వభావం ఏమిటని ప్రశ్నించుకోవాలి.

**భిక్షువు:** ఈ ప్రపంచం ఎంతో పతనావస్థలో ఉన్నది. ఆ స్థితి నుంచి రోజు రోజుకు ఆధ్యాత్మికంగా, విలువల పరంగా, బుద్ధి పరంగా ఇంకా దిగజారుతోంది. ఒక ఆధ్యాత్మిక గురువు, ఇటువంటి పతనావస్థ నుండి ప్రపంచాన్ని రక్షించటానికి వస్తాడా?

**మహర్షి:** ఖచ్చితంగా. ఎప్పుడైతే సమాజంలో మంచి లుప్తమౌతుందో మరియు చెడు బాగా వ్యాప్తి చెందుతుందో, అప్పుడు భగవంతుడు మంచిని పునరుద్ధరించటానికి వస్తాడు. ఈ ప్రపంచము అంత మంచిదీ కాదు, అలానే అంత చెడ్డదీ కాదు.

ఈ ప్రపంచం మంచీ చెడుల రెండింటి కలయిక. దుఃఖంతో కూడని సంతోషం లేదా సంతోషంతో కూడని దుఃఖం ఈ ప్రపంచంలో కనపడదు. ఈ ప్రపంచానికి భగవంతుని అవసరం ఎప్పుడూ ఉంటుంది. అలాగే, భగవంతుడు ఈ ప్రపంచానికి ఎప్పుడు అవసరమైతే అప్పుడు వస్తూనే ఉంటాడు.

**భిక్షువు:** అట్లా అయితే భగవంతుడు, తూర్పు దేశాలలో అవతరిస్తాడా లేక పశ్చిమ దేశాలలో అవతరిస్తాడా?

అప్పుడు భగవాన్ ఎటువంటి సమాధానం ఇవ్వకుండా నవ్వి ఊరుకున్నారు.

**హర్స్ట్:** మహర్షికి ఎవరైనా ఒక శరీరాన్ని ధరించిన అవతారం ఇప్పుడు ఉన్నదని ఏమైనా తెలుసా?

**మహర్షి:** ఉండి ఉండవచ్చు.

**హర్స్ట్:** దైవత్వాన్ని పొందటానికి ఉన్న అత్యుత్తమమైన మార్గమేది?

**మహర్షి:** ఆత్మ విచారణ, ఆత్మ సాక్షాత్కారాన్ని పొందే విధంగా చేస్తుంది.

హర్స్ట్: ఆత్మోన్నతికి ఒక గురువు ఆవశ్యకమా?

**మహర్షి:** అవును, ఆవశ్యకమే.

**హర్స్ట్:** ఒక వ్యక్తి ఆధ్యాత్మిక పథంలో పురోగమించటానికి గురువు సహాయం చేస్తాడా?

**మహర్షి:** చేస్తాడు.

**హర్ష్**: అయితే ఎటువంటి నియమాలు లేదా అర్హతలు ఒక వ్యక్తి ఉండాలి? లేదా పాటించాలి?

**మహర్షి:** ఆత్మ సాక్షాత్కారం పొందాలన్న తీవ్రమైన ఇచ్ఛ, మరియు స్వచ్ఛమైన మనస్సు కలిగి ఉండాలి.

**హర్ష్**: అప్పుడు, ఆ గురువు, ఆ వ్యక్తి యొక్క ప్రాపంచిక వ్యవహారాలను తన ఆధీనంలోనికి తీసుకుంటాడా?

**మహర్షి:** అవును. ఆ వ్యక్తి యొక్క అన్ని ప్రాపంచిక వ్యవహారాలను గురువు తన ఆధీనంలోనికి తీసుకుంటాడు.

**హర్ష్**: ఆ గురువు, ఆ వ్యక్తికి కావలసిన ఆధ్యాత్మిక వెలుగును ప్రసరింపచేస్తాడా?

**మహర్షి**:: గురువు ఆ వ్యక్తికి అవసరమైన అన్నింటినీ సమకూరుస్తాడు. దీనిని అనుభవంతో తెలుసుకోవచ్చు.

**హర్ష్**: ఆ అనుభవం పొందటానికి, ఆ వ్యక్తి భౌతికంగా గురువు సన్నిధిలో ఉండాలా? ఉండాలంటే ఎంతకాలం అలా ఉండాలి?

**మహర్షి:** అదంతా ఆ వ్యక్తి ఉన్న స్థితిని బట్టి ఉంటుంది. మందుగుండైతే ఒక్క క్షణంలో అంటుకుంటుంది. అదే బొగ్గును కాల్చాలంటే చాలా సమయం పడుతుంది.

**హర్ష్**: ఒక వ్యక్తి తన దైనందిన జీవితాన్ని ఏదో ఒక పనిలో గడుపుతూ, ఆత్మోన్నతిలో పురోగతి చెందవచ్చా? లేదా ఆత్మోన్నతికి పాటుపడవచ్చా

**మహర్షి:** జ్ఞానాన్ని పొందటానికి, పనికి, దైనందిన జీవితాన్ని

గడపటానికి ఎటువంటి వైరుధ్యము లేదు. అందుకు విరుద్ధంగా, స్వార్థరహితంగా మనం ఏ పని చేసినా అది ఆత్మజ్ఞానం పొందటానికి మార్గం సుగమం చేస్తుంది.

**హర్స్ట్:** ఒకవేళ, ఒక వ్యక్తి పనిలోనే నిమగ్నమైతే, ఆ వ్యక్తికి ధ్యానం చేసుకోవటానికి సమయం చాలా తక్కువ ఉంటుంది కదా?

**మహర్షి:** ప్రారంభ దశలో ఆధ్యాత్మికంగా ఎదగాలనుకునే వారు, ధ్యానానికి కొంత సమయం కేటాయించుకోవాలి. కాని, ఆ మార్గంలో బాగా పురోగమించిన వ్యక్తి, అన్ని వేళలా ఆనందాన్ని అనుభవిస్తూనే ఉంటాడు. పని చేస్తున్నా, చేయకపోయినా. అతని చేతులు సమాజంలో పని చేస్తూ ఉంటాయి కాని, అతని మనస్సు ఏకాంతంలో ప్రశాంతతతో నిండి ఉంటుంది.

**హర్స్ట్:** మీరు మెహర్ బాబాను గురించి విన్నారా?

**మహర్షి:** విన్నాను.

**భిక్షువు:** రాబోయే కొన్ని సంవత్సరములలో వారు ఒక అవతార పురుషుడు అవుతారని అన్నారు.

**మహర్షి:** ప్రతీ ఒక్కరు భగవంతుని అవతారములే. ''స్వర్గ సామ్రాజ్యం నీలోనే ఉన్నది.'' జీసెస్, మహమ్మదు, బుద్ధుడు, కృష్ణుడు వీళ్ళందరూ నీలోనే ఉన్నారు. ఎవరికైతే సత్యం ఎఱుకలో ఉంటుందో, వారు అంతటా, అన్నింటిలో భగవంతుడినే చూస్తారు.

**భిక్షువు:** మహర్షి, మెహర్ బాబా గురించి ఏమైనా ఒక మాట చెబుతారా?

**మహర్షి:** ఏమాట చెప్పాలి? సత్యాన్ని తెలుసుకోవాలని అనుకునే వ్యక్తి (బయట కనిపిస్తున్న అవతారాలను) అటువంటి ప్రశ్నల గురించి ఆలోచించరాదు లేదా పట్టించుకోకూడదు.

**భిక్షువు:** ఈ ప్రపంచం కొత్త జవసత్వాలను లేదా ఉత్సాహాన్ని పొందుతుందా?

**మహర్షి:** ఈ ప్రపంచాన్ని నడిపించే వాడొకడున్నాడు, వాడు చూసుకొంటాడు ఈ ప్రపంచం గురించి. ఎవరైతే, ఈ ప్రపంచాన్ని సృష్టించాడో వాడికి తెలుసు ఈ ప్రపంచానికి ఏ విధంగా మార్గ నిర్దేశనం చేయాలో లేదా నిర్వహించాలో.

**భిక్షువు:** ఈ ప్రపంచం పురోగమిస్తుందా? అభివృద్ధి చెందుతుందా?

**మహర్షి:** నీవు పురోగమిస్తే, ఈ ప్రపంచం కూడా పురోగమిస్తుంది. నీవు ఎట్లానో ఈ ప్రపంచం కూడా అలానే. తనను తాను తెలుసుకోకుండా ప్రపంచాన్ని తెలుసుకోవటం వలన ప్రయోజనమేమున్నది? తనని తాను తెలుసుకోని వ్యక్తి ప్రపంచం గురించి తెలుసుకోవటం వలన ఎటువంటి ప్రయోజనం లేదు. తనలో తాను అంతర్ముఖత్వం చెంది లోపల దాగి ఉన్న గొప్ప ఆధ్యాత్మిక నిధిని కనుక్కోవాలి. నీ హృదయాన్ని తెరచి నీ అంతర దృష్టితో ఈ ప్రపంచాన్ని ఆత్మగా చూడు. ఆత్మను తెలుసుకొనుటలో వచ్చే అన్ని ఆవరణలను త్రోసి పారవేయటం ద్వారా దైవ లీలలను నీవే చూడవచ్చు.

******

## అధ్యాయము - 3

# భగవాన్ సజీవ సత్సంగం

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all Creation **లోని వ్యాసాలకు స్వేచ్ఛానువాదం**

**(గత సంచిక తరువాయి)** **వి. రమేష్ బాబు**

భగవాన్ శ్రీ రమణ మహర్షి కొన్ని జీవులతో సజీవ సత్సంగం జరిగినప్పుడు అదృష్టవశాత్తు TRA నారాయణ దానికి సాక్షి అయ్యారు. ఆ అనుకోని సత్సంగం ఆయన హృదయంలో ఒక చెరగని ముద్ర వేసింది.

TRA నారాయణ మాటలలో: 1948లో నాకు 39 సంవత్సరాల వయస్సు. భార్య, నలుగురు పిల్లలతో నేను మద్రాసులో నివసిస్తున్నాను.

ఒక పెద్ద ఆంగ్లేయ సంస్థలో నేను బ్రాంచి మేనేజరును. ఆనందకరమైన పరిస్థితిలో చక్కగా నా జీవనయానం సాగిపోతున్నది. నేను సంతృప్తిగా ఉన్నాను. నాకు పెద్దగా మత సంబంధమైన, ఆధ్యాత్మిక పరమైన సాధనాలు అవసరం అనిపించలేదు.

ఉద్యోగరీత్యా నా క్రింద పనిచేసే ఒక ఇనస్పెక్టర్ పార్థసారథి. ఆయనతో కలిసి నేను చిన్న పట్టణాలను పర్యటించేవాడిని. మండు వేసవి ఏప్రిల్ నెలలో నేను, పార్థసారథి రైలులో తిరువణ్ణామలై వెళ్ళడానికి, విల్లుపురంలో ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ ఎక్కి కూర్చున్నాము.

*(సశేషం)*

# Humility and Spirituality

Dr K Subrahmanian

Happiness is something we feel within. When we try to seek happiness in books and other things outside of us, they give us only temporary peace; and what is more, if one is not careful, it might lead to pride – and pride and spirituality don't go together. Shankara, in the very first sloka of *Shatpadi* says,

अविनयं अपनयं विष्णो

*avinayayam apanayam vishno*

"O Lord! Remove my pride!" We cannot become humble on our own; only the Lord can do that! The first thing to realise is that humility is not something that we get by reading books; it is something that we get through his grace, and by being constantly in the company of people who are themselves humble. There is no place for pride during a *satsang*, and that is why our saints and sages have talked so much about it. The more we are in *satsang*, the less proud we will be. We must remember that it is not our achievements or our knowledge that will give us happiness – they are only temporary. For permanent peace and happiness, we need to look inside of us. In order to get conventional knowledge, we need to apply our mind externally, but in order to experience happiness and peace of the mind, we need to go within. We know how difficult it is to have this *antar mukha drishti*, because for us, the mind is always moving outside – *bahir mukha drishti*. It is but natural for the mind not to look within; in order to

find *shanti*, however, we need to make a conscious effort to make the mind go within – *bahir mukha drishti* versus *antar mukha drishti*.

As we all know, running forward is easy; running backward, on the other hand, is difficult. Meditation is like running backward, and that is why we face problems, for the mind has to do something which it normally does not – go within. If we practise meditation continuously, after sometime, through the grace of God, we will achieve this. The mind, after all, is only a bundle of thoughts, and as each thought arises, if we consciously ask the question, "To whom does this thought arise?", our thoughts will become weak. If we meditate in this fashion, even for about ten minutes every day, it is likely that we will have complete absence of thoughts for a few seconds. With the passage of time, and through the Lord's grace, we will reach a stage where we will have reasonable peace within ourselves, and that peace, we will continue to experience even in the midst of our work.

